క్లుప్తంగా

అందుబాటులోకి 108 వాహనం



గరిడేపల్లి మండలానికి కేటాయించిన 108 వాహనం

గరిడేపల్లి : మండలానికి రాష్ట్ర ప్రభుత్వం 108 వాహనాన్ని కేటాయించింది. ఈ 108 వాహనంలో పైలెట్‌తో పాటు హెల్త్ టెక్నీషియన్ ఉంటారు. పైలట్‌గా నేలపట్ల రవి, హెల్త్ టెక్నీషియన్‌గా ఎం.సరిత పనిచేస్తున్నారు. గతంలో మండలంలో ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో నేరేడుచర్ల లేదా హుజూర్‌నగర్ నుంచి 108 వాహనం వచ్చేది. కానీ అంబులెన్స్ సమయానికి రాక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం గరిడేపల్లి మండలానికి ప్రత్యేకంగా 108 నూతన వాహనాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తేవడంతో మండలంలో ప్రమాదం బారిన పడిన వ్యక్తులకు అత్యవసర సేవలు అందించే అవకాశం కలిగింది. 108 వాహనం కేటాయించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నడిగూడెం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రామకృష్ణారెడ్డి



నడిగూడెం : నడిగూడెం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రామకృష్ణారెడ్డి మంగళవారం విధుల్లో చేరారు. నడిగూడెం తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరిత సెలవులో ఉన్నారు. దీంతో కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పని చేస్తున్న రామకృష్ణారెడ్డి నడిగూడెం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు.

రేపు వాహనాల వేలం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులలో పట్టుబడి సీజ్ చేయబడిన 15 ద్విచక్ర వాహనాలను డిసెంబర్ 19న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9 గంటల నుంచి ఎక్సైజ్ స్టేషన్‌లో ముందస్తుగా దరావత్ రుసుం చెల్లించాలని ఆయన తెలిపారు.


విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ



ప్యాడ్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణయాదవ్

మునగాల : తెలంగాణ ప్రైవేటు జూనియర్ కళాశాలల ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు, కోదాడలోని వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ బాణాల వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ మంగళవారం మండలంలోని గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, ఉపేందర్, జయశ్రీ, రాణి, బీసీ సంఘం నాయకులు గుండు గోపిగౌడ్, నెమ్మాది అజిత్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ పీఎంజేఎఫ్ డిస్ట్రిక్ చైర్మన్, మోటివేషనల్ స్పీకర్ లయన్ రేపాల మదన్‌మోహన్ అందించిన రూ.18 వేల ఆర్థిక సహకారంతో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి అందజేశారు. జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, మండల విద్యాధికారి పి.సత్యనారాయణరెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, యూసుఫ్, కొణతం ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, చిలకరాజు శ్రీను, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ప్రథమ బహుమతి

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన రంగస్థల కళాకారుడు, గాయకుడు గోపనబోయిన వెంకటేశ్వర్లుకు ప్రథమ బహుమతి లభించినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

నాగరాజు మృతి బాధాకరం

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న హుజూర్‌నగర్‌కు చెందిన ఇందిరాల నాగరాజు మృతి బాధాకరమని గరిడేపల్లి మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో నాగరాజు కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు వెంకటేశ్వర్లునాయక్, జయరాంనాయక్, రాము పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం ఖరారు!

- కొలిక్కి వచ్చిన ఎంపిక
- నడిగూడెం వాసికే చైర్మన్
- మైనార్టీ నాయకుడికి వైస్ చైర్మన్
- డైరెక్టర్ల పదవుల పంపకం పూర్తి

కోదాడ : పాలకవర్గం లేక రెండు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న కోదాడ వ్యవసాయ మార్కెట్‌కు త్వరలోనే నూతన పాలకవర్గం రానున్నది. కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తరువాత ప్రోటోకాల్ ఉన్న పదవి మార్కెట్ చైర్మన్. కానీ అధికార పార్టీ నేతల్లో నెలకొన్న పోటీతో వాయిదా పడుతూ వచ్చింది. అన్నింటిని సర్దుబాటు చేసిన నేతలు రెండు మూడు రోజుల్లో పాలకవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోదాడకు చెందిన ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసినప్పటికీ ఎన్నికల సందర్భంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి నడిగూడెం మండలానికి చెందిన ఒకరికి మాట ఇచ్చినందున వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇదే మండలానికి చెందిన మరో ఇద్దరు నేతలతో పాటు కోదాడకు చెందిన మరొకరు ఈ పదవి కోసం విశ్వప్రయత్నం చేసినా చివరికి గత రెండు విడతలుగా కాంగ్రెస్ పార్టీ నుంచి నడిగూడెం మండల జెడ్పీటీసీగా పోటీ చేసి ఓటమి పాలైన నేత సతీమణికి ఈ చైర్మన్ పదవి ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం.



కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

రెండు సంవత్సరాలుగా ఖాళీ..

కోదాడ మార్కెట్ చైర్మన్ పదవిని గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. ఎన్నికలకు సంవత్సరం ముందే మాజీ చైర్మన్ బుర్రా సుధారాణి పదవీ కాలం ముగిసింది. అయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే.. చైర్మన్ పదవిని పలువురికి ఇస్తానని చివరకు ఎవ్వరికి ఇవ్వలేదు. ఈ లోగా ఎన్నికలు రావడంతో ఇది పెండింగ్‌లో పడింది. ప్రభుత్వం మారడంతో వెంటనే చైర్మన్ పదవిని భర్తి చేయాలని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు కోరుతూ వచ్చారు. అయినా భర్తీ చేయకుండానే సంవత్సర కాలం ముగిసింది. ఎస్సీలకు రాక రాక వచ్చిన ఈ అవకాశాన్ని రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ పదవిని వెంటనే భర్తీ చేయాలని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి భావించినప్పటికీ ఎస్సీ నేతల్లో పోటీ ఎక్కువ కావడంతో పాటు వైస్ చైర్మన్‌గా ఖరారైన నేత చైర్మన్ పదవి కోసం మరొకరిని సిఫార్సు చేయడంతో మరికొంత ఆలస్యం అయినట్లు సమాచారం. చివరకు ఎమ్మెల్యే తాను ఇచ్చిన మాట ప్రకారం నడిగూడెం నేతకు చైర్మన్ పదవిని ఖరారు చేయగా మంత్రి ఉత్తమ్ కోదాడకు చెందిన మైనార్టీ నాయకుడిని వైస్ చైర్మన్‌గా ఖరారు చేసినట్లు సమాచారం. ఇక ప్రతి మండలానికి ఇద్దరు డైరెక్టర్లను ఆయా మండల పార్టీ సిఫార్సు చేసిన వారికి ఇవ్వనున్నారు.

బీసీలకు అవకాశం ఏదీ..

కోదాడ నియోజకవర్గంలో బీసీ జనాభా ఎక్కువగా ఉన్నా తమ వర్గానికి ఏ ఒక్క పదవి రాకపోవడంతో వీరు కినుకు వహిస్తున్నారు. మార్కెట్ చైర్మన్ ఎస్సీ సామాజిక వర్గానికి పోగా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కూడా ఓసీ వర్గానికి ఇచ్చారని, త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్మన్ పదవి ఓసీ వర్గానికి వెళ్తుందని, ఇక బీసీలకు అవకాశం ఏదని వారు ప్రశ్నిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనైనా తమకు అవకాశం ఇవ్వాలని వారు ఎమ్మెల్యే, మంత్రిని కోరుతున్నారు. బీసీ వర్గానికి చెందిన చింతలపాటి శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, కేఎల్ఎన్ ప్రసాద్‌లు తమకు రాష్ట్ర స్థాయిలో ఏదో ఒక నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. మరి మంత్రి, ఎమ్మెల్యే వీరికి ఏ పదవులు ఇస్తారో వేచి చూడాలి.

కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించాలి



కోదాడ : నూతన కార్యవర్గంతో జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షులు భూలోకరావు, కర్తయ్య



మునగాల : నూతన కమిటీ సభ్యులు

కోదాడ: పట్టణ ప్రాంతంతో ఉన్న క్రీడాకారులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించాలని కబడ్డీ అసోసియేషన్ అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షులు భూలోకరావు, కర్తయ్య కోరారు. మంగళవారం కోదాడలోని ఎంఎస్ కళాశాలలో జరిగిన కోదాడ మండల కబడ్డీ క్రీడాకారుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కోదాడ ప్రాంతంలో కబడ్డీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ కోదాడ మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎండీ. మహబూబ్ జానీ, ఈదుల కృష్ణయ్య, ఆరుమళ్ల సీతయ్య, అధ్యక్షుడిగా షేక్. బాగ్దాద్, ఉపాధ్యక్షులుగా కత్తి సైదులు, వెంకటరత్నం, రఫీ, ప్రధాన కార్యదర్శిగా నామా నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా కాంపాటి శ్రీనివాసరావు, షేక్ బాజాన్, పంది తిరపతయ్య, కోశాధికారులుగా సోమపంగు శ్రీను, నాల్లయ్య మండల అసోసియేషన్ చైర్మన్‌గా షేక్ ముస్తాఫాలను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని అల్లం ప్రభాకర్‌రెడ్డి, పందిరి నాగిరెడ్డి, గంధం పాండు, ఎస్ఎస్.రావులు ఘనంగా సన్మానించారు.

కబడ్డీ అసోసియేషన్ మండల కార్యవర్గం ఎన్నిక

నడిగూడెం : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కబడ్డీ అసోసియేషన్ మండల స్థాయి సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా పేరెల్లి కోటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, కోశాధికారిగా బాణాల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా గంటిపంగు నాగార్జున, కార్యవర్గ సభ్యులుగా మేకల వీరేశం, పుట్టా మహేష్, పందిటి వంశీ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కోటి మాట్లాడుతూ మండలంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



నడిగూడెం : నూతన అధ్యక్షుడు పేరెల్లి కోటి

మునగా మండల కమిటీ..

మునగాల : కబడ్డీ అసోసియేషన్ మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూలోకరావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కర్తయ్య సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా అంబటి లింగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి.నరేష్, బి.సుందరయ్య, కార్యదర్శిగా ఎం.సైదులు, జాయింట్ సెక్రటరీలుగా జి.లక్ష్మయ్య, షేక్ నబీసాహెబ్, కోశాధికారిగా సాల రవి, కార్యవర్గ సభ్యులుగా బి.అంజి, ఎం.శ్రీనివాసరావు, చెరుకు బాబును ఎన్నుకున్నారు.

పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, జీఓ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన ధర్నాకు వెళ్లబోతున్న మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు కార్మికులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. అర్హులైన గ్రామ పంచాయతీ కార్మికులకు పదోన్నతి కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హసన్‌మియా, ప్రధాన కార్యదర్శి కొండలు, ఎల్లమ్మ, రత్నం, అంజయ్య, వీరారెడ్డి, రామారావు, కనకయ్య, శ్రీను, లింగం, మట్టయ్య, వెంకన్న పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ రూరల్ : జీపీ కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జీపీ కార్మికుల అరెస్టు సరైంది కాదు

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్కే యాకూబ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అరెస్టు కాబడిన పంచాయతీ కార్యదర్శులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, కనీస వేతనం రూ. 26 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, నాగరాజు, ఇసాక్, గంగరాజు రాములు, రవి, వెంకటాచారి, మరియమ్మ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యార్థులు డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అంతిరెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలం గుడిమల్కాపురం పరిధిలోని సీత మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల నివారణపై పోలీసు కళాబృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసాలకు గురి కావద్దని చెప్పారు. బ్యాంక్ ఖాతా, పాన్‌కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులపై 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం థామస్, పోలీస్ కళాబృందం సభ్యులు గోపయ్య, గురులింగం, కృష్ణాచారి, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగల 'మహాగర్జన'ను జయప్రదం చేయాలి

చిలుకూరు : హైదరాబాద్‌లో వచ్చే నెల 19వ తేదీన జరిగే మాదిగల మహాగర్జనలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింతా బాబు మాదిగ కోరారు. ఈమేరకు మంగళవారం మండలంలోని చిలుకూరు, సీతారాంపురం, నారాయణపురం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలు అణిచివేతకు గురవుతున్నారని, ఇప్పటికైనా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణాల అబ్రహం, మండల అధ్యక్షుడు బొల్లెపంగు కాశి, నాయకులు కందుకూరి నాగేశ్వరరావు, స్వామి, కొత్తపల్లి శ్రీనివాస్, చింతా శ్రీను, వెంకటేశ్వర్లు, అంజి, నరసింహారావు, సీతారాములు, ఏసోబు, లాలు, తిరపయ్య పాల్గొన్నారు.



నారాయణపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సహకార బ్యాంకును సందర్శించిన విద్యార్థులు



సహకార సంఘం బ్యాంకులో సేవల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వృత్తి నైపుణ్య శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక సహకార సంఘం బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు సేవల గురించి సహకార బ్యాంకు మేనేజర్ సతీష్ వారికి వివరించారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ వర్క్‌షాప్‌ను సందర్శించి మోటారు వైండింగ్ గురించి తెలుసుకున్నారు. అగ్రికల్చర్ క్రాఫ్ ప్రొడక్షన్ కోర్సు విద్యార్థులు.. గడ్డిపల్లి కేవీకేను సందర్శించి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, వెంకన్న, ప్రసాద్, వీరునాయక్, అపర్ణ, వీరేశం తదితరులు ఉన్నారు.

గ్రామాలకు పోలింగ్ స్టేషన్ల తుది జాబితా పంపిణీ



పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్య

హుజూర్‌నగర్‌రూరల్ : సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ఆయా గ్రామాల కార్యదర్శులకు అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి పోలింగ్‌స్టేషన్ల జాబితాలపై పలు సూచనలు చేసి మాట్లాడారు.

నేడు ప్రజా వేదిక

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య మంగళవారం తెలిపారు. అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరారు.

ఎన్‌టీఆర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

నడిగూడెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, దేవరంగుల వీరన్న, బూరుగడ్డ థామస్, దేవరంగుల దుర్గారావు పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికే రుణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటించి నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో సీపీఐ సభ్యత్వ పునరుద్ధరణ సందర్భంగా నిర్వహించిన పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కుందూరు వెంకటరెడ్డి, అంబటి వెంకటరెడ్డి, గోదుమల ఈశ్వరాచారి, దైద ఏసుపాదం, మాతంగి వెంకన్న, కేతిరెడ్డి సంజీవరెడ్డి, మాతంగి ప్రేమనందం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లపై అవగాహన



వరినాట్లపై అవగాహన పొందుతున్న మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు

గరిడేపల్లి : హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో వరి నాట్లు వేయడంపై అవగాహన పొందారు. 30 రోజుల క్రితం విత్తనాలు చల్లగా మొలకెత్తిన నారును దమ్ము చేసిన పొలంలో నాట్లు పెడుతున్నట్లు వ్యవసాయ కూలీలు ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. నాటు వేసేందుకు ఒక్కో ఎకరానికి రూ. 4300 చెల్లించాలని రైతు తెలిపారు. కార్యక్రమంలో రైతులు వెంకట్‌రెడ్డి, సైదులు, వీరస్వామి, మారయ్య, హనుమంతరావు, రాంభాయ్, రేణుక, పద్మ, రమాదేవి, సత్య, గోవిందమ్మ, విద్యార్థులు వి.చందన, భావన, అలేఖ్య, హర్షశ్రీ, అలియాభేగం పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన్ డిమాండ్ చేశారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలలోని ఎంఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావొస్తుందని ఇప్పటికైనా యువతకు న్యాయం చేయకుంటే నిరుద్యోగులను, యువతను ఐక్యం చేసి పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

నడిగూడెం : తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని కరివిరాల గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీ అధికారులను కోరారు. మంగళవారం కరివిరాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో చేపట్టిన పనులకు ఎంబీలు చేసినా ఓ మండల స్థాయి అధికారి బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నట్లు ఆరోపించారు.

ప్రజాపాలన ముసుగులో ప్రజా కంటక పాలన

హుజూర్‌నగర్ : తెలంగాణలో ప్రజా పాలన ముసుగులో ప్రజా కంటక పాలన నడుస్తోందని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.అమర్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు అన్నారు. లగచర్ల రైతులపై కేసులకు నిరసనగా బీఆర్ఎస్ పిలుపు మేరకు మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆ పార్టీ నాయకులు బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులపై అక్రమ కేసులు పెట్టి, బేడీలు వేసి, చిత్రహింసలకు గురి చేసేది ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డి.అప్పిరెడ్డి, కరుణసైదులు, జగన్‌నాయక్, ఇరుగు పిచ్చయ్య, అబ్దుల్ నబీ, బచ్చు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆర్.శంబిరెడ్డి కె.వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాంబాబు, నగేష్ రాథోడ్, చంద్రమౌళి, భిక్షం, పరుశురాం మట్టారెడ్డి, రత్నశ్రీ, సంతోష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

చింతలపాలెం మండలంలో..

చింతలపాలెం మండలంలోని మల్లారెడ్డిగూడెం, దొండపాడు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు.. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ పి. శ్రీనివాసరావు, తోట శేషు, ఎం. వెంకటరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తివేయాలని ఆందోళన

కోదాడ : వికారాబాద్ జిల్లాలోని లగచర్ల రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని కోరుతూ మంగళవారం కోదాడ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న రైతులకు బేడీలు వేసి తీసుకుపోవడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలేటి నాగేశ్వరరావు, మేదర లలిత, మామిడి రామారావు, దొంగరి శ్రీను, కర్ల సుందర్‌బాబు, చలిగంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

గరిడేపల్లి : లగచర్ల రైతులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండవ నాగేశ్వరరావుగౌడ్, ఉద్యమకారులు అమరగాని లక్ష్మణ్, గోపాలదాసు హుస్సేన్, పిడమర్తి గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి

మోతె : రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు అన్నారు. లగచర్ల రైతులకు అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుండాల గంగులు, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు నరేష్, మోతె గ్రామ శాఖ అధ్యక్షుడు ఇండ్ల వెంకటేశం పాల్గొన్నారు.



కోదాడ : మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి వినతి

నడిగూడెం : లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నడిగూడెంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అనంతుల మహేష్‌గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్, నాయకులు బొల్లం శ్రీను, ఎస్కె.జలీల్, దున్నా ప్రవీణ్, దున్నా రవి, బుడేసాహెబ్, గోలి వెంకన్న, శ్రీరాములు శేషు, కృష్ణమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా మాలధారుల ఇరుముడి మహోత్సవం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాస్వాములు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడులతో శబరికి వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

వైభవంగా నారసింహుని నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి మహాక్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని వేదపండితులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యకల్యాణంలో భాగంగా ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చన గావించారు. నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



తాళిబొట్లు చూపిస్తున్న అర్చకుడు

దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలి

హుజూర్‌నగర్ : పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లలో దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలని పట్టణ వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆకుల రాము కోరారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఆ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వీరాంజనేయులు ఖాదర్, లక్ష్మణరావు, పిచ్చయ్య, శ్రీనివాస్, పుల్లయ్య, అసోదు, శ్రీను, శ్రీను, రామాచారి, రూపారాణి, ఆదిలక్ష్మి, తారాబీ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

చిలుకూరు: మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, పూజారి రజనీకాంత్ ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.